క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ, గణేశ్ ప్రతిమలతో శోభాయాత్ర



జనగామ: పట్టణంలోని గుండ్లగడ్డ ఏరియా నుంచి హిందూ ప్రతినిధి గోరంతల సునీల్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్, గణేశ్, హనుమంతుడి ప్రతిమలతో శోభాయాత్ర నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను చాటుకుంటూ పురవీధుల గుండా ర్యాలీ తీయగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు.

నేడు కరెంట్ కోతలు

జనగామ: పట్టణంలో రెండో శనివారం పురస్కరించుకుని కొత్త సబ్‌స్టేషన్ మెయింటనెన్స్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గణేశ్‌వాడ, ధర్మకంచ, దుర్గమ్మ ఆలయం, అంబేడ్కర్‌నగర్, కుర్మవాడ, పాత మార్కెట్, పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పాత కూరగాయల మార్కెట్, పోలీస్‌స్టేషన్, రెడ్డిస్ట్రీట్, అమ్మబావి పరిధిలో 11 కేవీ కంట్రోలింగ్, ఏబీ స్విచ్‌ల మరమ్మతు కారణంగా మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ శంకర్ తెలిపారు.

దరఖాస్తులను పరిశీలిస్తాం..



బచ్చన్నపేట: రుణ మాఫీ కాని రైతులు చేసుకున్న దరఖాస్తులను గ్రామాల వారీగా పరిశీలిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం పలువురు రైతుల వద్ద నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, ఏఈఓలు రాజు, జయరాజ్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే మేలు



లింగాలఘణపురం: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు రాకుండా ఉంటాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మండలంలోని పటేల్‌గూడెంలో ప్రత్యక్షంగా పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, ఎంపీడీఓ జలందర్ రెడ్డి, ఎంపీఓ రఘురామకృష్ణ, మండల వైద్యాధికారి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాన కల్పించారు. ప్రిన్సిపాల్ వీరమానేని వెంకటేశ్వర్‌రావు, ఎస్సై సాయి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్సీ బస్తీ ఆర్సీఎం చర్చి ఆవరణలో శుక్రవారం ఘన్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో 179 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు సంధ్యారాణి, జనార్దన్, సంధ్య, జువైది, సీహెచ్‌ఓ వెంకటస్వామి, సబ్ యూనిట్ ఆఫీసర్ శేషయ్య పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన మంద యాదగిరి (45)కి భార్యతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన యాదగిరి ఈనెల 11వ తేదీన తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం శవపంచానమ నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఊరూరా ఓటరు జాబితా ప్రదర్శన



రఘునాథపల్లి: ఓటరు లిస్టు ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ



బచ్చన్నపేట: తమ్మడపల్లిలో.. ఎంపీడీఓ మల్లికార్జున్



తరిగొప్పుల: అక్కరాజుపల్లిలో.. కార్యదర్శి రత్న

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా తయారు చేసిన ఓటరు లిస్టును గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై అంటించడం జరుగుతుందని ఒక వేళ ఎవరివైనా పేర్లు, వార్డుల పేర్లు లేకుంటే తమకు తెలియజేసి సరిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి కవితతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఓటరు జాబితాను నోటీస్‌బోర్డుపై అంటించినట్లు ఎంపీడీఓ మల్లికార్జున్ తెలిపారు. జాబితాలో సవరణలు ఉంటే ఆయా గ్రామాల బీఎల్‌ఓలకు వెంటనే తెలియజేయాలని అన్నారు.

ఓటరు జాబితాలో సవరణలకు బీఎల్‌ఓలను సంప్రదించాలి

తరిగొప్పుల: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని పంచాయతీ కార్యదర్శి రత్న సూచించారు. మండలంలోని అక్కరాజుపల్లిలో వార్డుల వారీగా ఓటరు జాబితాను గ్రామపంచాయతీ ఆవరణలో నోటీస్ బోర్డుపై అంటించారు. కారోబార్ అక్తర్, అంకం రాజు, ఆశ వర్కరు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే హీనులవుతారు



షేక్ బందగీ స్తూపానికి నివాళులర్పిస్తున్న రంగారావు, సదానందం తదితరులు

దేవరుప్పుల: కులమతాలకతీతంగా కొనసాగిన వీరోచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించే రాజకీయశక్తులు చరిత్రహీనమవుతాయని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జాతీయ సహాయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు హెచ్చరించారు. దేవరుప్పుల మండలం కడవెండి, కామారెడ్డిగూడెంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17ను విద్రోహంగా దినంగా పాటిస్తూ నాటి యోధులను శుక్రవారం స్మరించుకున్నారు. దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం నుంచి షేక్ బందకీ స్తూపం వరకూ పురవీధుల్లో ర్యాలీ, బైక్ ర్యాలీలతో విప్లవ జోహార్లు అర్పిస్తూ విప్లవోద్యమం నిర్మిద్దామని శపథం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభకు మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం సదానందం అధ్యక్షతన వహించగా ఆయన మాట్లాడారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం, గోకిన పెల్లి వెంకటేశ్వర రావు, పాయం చిన్న చంద్రన్న, ఆవుల వెంకటేశ్వర్లు, పి వై పుల్లయ్య, వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శులు శివకుమార్, రవి, చిర్రా సూరి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు

స్టేషన్‌ఘన్‌పూర్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి భారతదేశ వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సీతారాం సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అదేవిధంగా సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ ఆధ్వర్యంలో ఇప్పగూడెంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు రాపర్తి సోమయ్య, జువారి రమేశ్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. అలాగే తమ్మడపల్లి (జి) గ్రామంలో సీతారం ఏచూరికి పలువురు నివాళులర్పించారు.

సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

రఘునాథపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల మండలంలో సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. వెల్ది మోడల్ స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పొదల లవణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి సాదం రమేశ్, సాదం రామరాజు, మూడిక భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు.

ఏచూరి పోరాట ఘట్టాలు చిరస్మరణీయం

దేవరుప్పుల: విద్యార్థి దశనుంచే ఎర్రజెండా చేతబూని తాడిత, పీడిత ప్రజానీకం కోసం ఎంతో మంది కామ్రేడ్లను తయారు చేసిన ఎర్రని సూర్యుడు, సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పోరాట ఘట్టాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. మండంలోని నీర్మాలలో కాసం కృష్ణమూర్తి స్మారక స్తూపం వద్ద ఏచూరి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘననివాళులర్పించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

జఫర్‌గఢ్: ఎంతో ప్రసిద్ధి చెందిన వేల్పుగొండ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో ఆలయ అభివృద్ధితో పాటు గ్రామ సమస్యలపై రామాలయం వద్ద ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. గుట్టపైకి భక్తులు వెళ్లేందుకు సీసీ రోడ్డు, మెట్లు, లైటింగ్, కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. నాయకులు మనోజ్‌రెడ్డి, భిక్షపతి, బ్రహ్మారెడ్డి, కర్ణాకర్ రావు, రడపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ నిధుల గోల్‌మాల్‌పై డీఎల్‌పీఓ విచారణ



జనగామ రూరల్: మండలంలోని పసరమడ్ల గ్రామంలో మాజీ సర్పంచ్, కార్యదర్శి జీపీ నిధులు గోల్ మాల్ చేశారని గ్రామస్తులు గతంలో కలెక్టర్, మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి జీపీ కార్యాలయంలో గ్రామస్తులు, మాజీ సర్పంచ్, కార్యదర్శిల సమక్షంలో వారి ఫిర్యాదులను స్వీకరించారు. ఇరుపక్షాల వివరాలను తీసుకున్న అనంతరం విచారణ చేపట్టి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వెంకట్‌రెడ్డి తెలిపారు. కాగా, మాజీ సర్పంచ్ శివరాత్రి స్వప్న రాజును వివరణ కోరగా గ్రామంలో కొందరు కావాలని రాజకీయంగా ఎదుగుదల ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎలాంటి విచారణకైన సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థులకు గణితంపై ఆసక్తి కలిగించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు గణితంపై భయం లేకుండా చేసి ఆ సబ్జెక్టుపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవతో పనిచేయాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6,7వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు సుతారి మురళీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్‌రీచ్‌మెంట్ ఇన్ బేసిక్ ఆపరేషన్స్ ఆఫ్ మ్యాథమెటిక్స్ పుస్తకాలను ఉచితంగా అందించారు. పాఠశాల హెచ్‌ఎం సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణపయ్య



జనగామ: స్వామికి సమర్పించిన 108 రకాల నైవేద్యాలు



జనగామ: కూరగాయల మార్కెట్ రోడ్డులో కుంకుమార్చన..



నర్మెట: వేంకటేశ్వరాలయ గణపతి మండపంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



దేవరుప్పుల బస్టాండ్ కాలనీలో..

సాక్షి నెట్‌వర్క్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో కొలువుదీరిన గణపయ్యకు జిల్లా వ్యాప్తంగా భక్తులు శుక్రవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజ చేసి మహా నైవేద్యం సమర్పించారు. పలు మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



జనగామ: పీఎస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ/రఘునాథపల్లి/చిల్పూరు/తరిగొప్పుల/నర్మెట/జఫర్‌గఢ్/బచ్చన్నపేట/దేవరుప్పుల/పాలకుర్తి టౌన్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హౌజ్ అరెస్టును నిరసిస్తూ వారికి మద్దతు తెలిపేందుకు చలో హైదరాబాద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని, అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని వదిలేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..



పాలకుర్తిటౌన్: కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ యాకాంతరావు, బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: కొత్త, పాత లేకుండా కాంగ్రెస్ గొడుగు కింద పనిచేయాలని, ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెడ్డిగార్డెన్‌లో జరిగిన సమావేశంలో పాలకుర్తి మాజీ సర్పంచ్ వీరమానేని యాకంతారావు, ముదిరాజ్ మహాసభ నియోజవర్గ కన్వీనర్ చిక్కుడు రాములు, సర్పంచ్‌ల ఫోరం దేవరుప్పుల మండల మాజీ అధ్యక్షుడు కూర్నాల రవితోపాటు పాలకుర్తి, శాతాపురం, గూడూరు, వల్మిడి, నర్సింగాపురం గ్రామాలకు చెందిన 300 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఝాన్సీరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల కాంగ్రెస్ మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, దారవత్ సురేష్‌నాయక్, నల్ల శ్రీరాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



చిల్పూరు: మల్కాపూర్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చిల్పూరు: మండలంలోని రాజవరం (స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్), మల్కాపూర్‌లో, గార్లగడ్డతండాలోని మల్లన్నగండి రిజార్వాయర్, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట, చిల్పూరు గ్రామాల్లో వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద ఏర్పాట్లను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని, అందుకు మండప నిర్వాహకులు సహకరించాలని అన్నారు. ఆర్ఐ కల్వల శ్రీనివాస్, ఎంపీఓ మధుసూదన ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు నవనీత, రంగారెడ్డి, హరిప్రసాద్, బాపునాయక్ ఉన్నారు.

డీజే సౌండ్‌లు పెడితే చర్యలు

దేవరుప్పుల: గణేశ్ నిమజ్జన ఊరేగింపులో డీజేసౌండ్ బాక్సులు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు అనివార్యమని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న డీజే సౌండ్ సిస్టమ్స్ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై ఊర సృజన్‌కుమార్, ఏఎస్సై సదానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన

పాలకుర్తి టౌన్: గణపతి నిమజ్జనం సందర్భంగా డీజేలు ఏర్పటు చేస్తే చర్యలు తీసుకుంటామని డీజే నిర్వాహకులను ఎస్సై మెడం సాయిప్రసన్న హెచ్చరించారు. స్థానిక పోలీస్‌సేష్టన్‌లో డీజే నిర్వహకులకు అవగాహన కల్పించారు. డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే డీజేలను సీజ్ చేస్తామని తెలిపారు. ఎస్సై లింగారెడ్డి పాల్గొన్నారు.

నేడు బాలయేసులో స్పోర్ట్స్‌మీట్

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బాలయేసు ఇన్‌గ్లిష్ మీడియం హైస్కూల్‌లో నేడు(శనివారం) స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు శుక్రవారం తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డీఈఓ కె.రాము తదితరులు రానున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు జమాల్ షరీఫ్ కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సమద్ రహెమాన్, హఫీజ్, అజ్ఘర్, అఫ్జలుద్దీన్, అజీమ్, సమీర్, ఖదీర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

పాలకుర్తి: ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కయ్య అన్నారు. పాలకుర్తిలో ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు చిదిరాల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎం.డీ షరీఫ్, ఎండీ అప్సర్, పి.కమలాకర్ రెడ్డి, డి.సూర్య ప్రకాష్, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

జనగామ రూరల్: ఈకుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉమాపతి భవన్‌లో మండల అధ్యక్షుడు ఎ.రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.గణేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.కనకయ్య ఎన్నికయ్యారు.

బావుల వద్ద విద్యుత్ పరికరాల ధ్వంసం

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన నలుగురు రైతుల వ్యవసాయ బావుల వద్ద విలువైన విద్యుత్ సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు అరటి గెలలు, తదితర వస్తువులను బావుల్లో పడేశారు. బాధిత రైతులు ఊరడి యాదగిరి, సాదం రాజ్‌కుమార్, సాదం శ్రీనివాస్, కుంచాల రాజులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం సాయంత్రం వ్యవసాయ బావుల వద్ద పనిచేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా బోరు మోటార్ స్టాటర్లు, పైపులు పగుల గొట్టి కనిపించాయి. అలాగే కొట్టంలో ఉండే మంచాలు, బిందెలు, అరటి గెలలు వ్యవసాయ బావుల్లో పడవేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాధితులకు న్యాయం చేస్తాం..

చిల్పూరు: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి బాధితులకు న్యాయం చేస్తామని ఆర్ఐ కల్వల శ్రీనివాస్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో ఆక్రమణకు గురై వివాదస్పదంగా మారిన 68,69 సర్వే నంబర్లలోని సీలింగ్ భూములకు శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో చిల్పూరు రెవెన్యూ అధికారి కల్వల శ్రీనివాస్, సర్వేయర్ నరేష్‌నాయక్ సర్వే నిర్వహించారు. త్వరలో అసలైన లబ్ధిదారులకు భూమిని అప్పగించడం జరుగుతుందని తెలిపారు.

అవగాహన

జఫర్‌గఢ్: బాల్యవివాహాల నిరోధించడం, పోక్సో చట్టాలపై విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల లైబ్రేరియన్ ధనుంజయ మాట్లాడుతూ దేశంలో బాల్యవివాహాలను అరికట్టినప్పటికీ బాలికలపై లైంగిక వేధింపులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రాజుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొడకండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోని శక్తి కేంద్రాలు, బూత్ స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ కొంతం శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రమేశ్, రాజశేఖర్, శిరాజ్, మహేందర్, సోమన్న, ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్పోర్ట్స్ టీషర్టుల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు శుక్రవారం స్పోర్ట్స్ టీషర్టులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కొడ రాజేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కెనరా బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ముంద్రాతి నరసింహస్వామి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మురళి కలిసి టీషర్టులను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు లింగమూర్తి, రంజిత్, శ్రీనివాస్, గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి, పీడీ రుద్ర అనసూర్య, శ్రీనివాస్, రవీందర్, వీరబ్రహ్మం, సల్లవుద్దీన్, జగదీష్, సువర్ణ, రాణి, రవి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల..

తరిగొప్పుల: మండలకేంద్రంలోని రైతు వేదిక భవనం ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ నాగేశ్వర చారి శుక్రవారం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.20.2లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, జూనియర్ అసిస్టెంట్స్ శ్రీధర్, మంజుల తదిరులు పాల్గొన్నారు.

‘తెలంగాణలో నిర్బంధం పునరావృతం’

దేవరుప్పుల: సమైఖ్య రాష్ట్ర తరహా తెలంగాణలో నిర్బంధ ఛాయలు పునరావృతమవుతున్నాయని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహచర ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విమర్శలకు ప్రతి విమర్శలు చేయాల్సిన ఎమ్మెల్యే గాంధీ గుండాగిరి మాదిరి ఇంటిపై దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు.

మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌జీ మృతి

కొడకండ్ల: రామవరం గ్రామ మాజీ సర్పంచ్ దుంబాల లక్ష్మణ్‌జీ శుక్రవారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీలతో పాటు నాయకులు లక్ష్మణ్‌జీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామ వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకుడు ఇంజ మనోహర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాగు నుంచి రాత్రి వేళ అడ్డూ అదుపు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

జనగామ రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఇచ్చిన శిక్షణలో ప్రతిభ కనబర్చిన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు సర్టిఫికెట్లను అందజేశారు. 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పలు అంశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్.శ్రీకాంత్, దశరథ్, పీజీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: ధరణి సమస్యలను పరిష్కరించాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా కో కన్వీనర కాసోజు బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గాడిపెల్లి యాకన్న, రాడపాక సందీప్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నర్మెట: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి కె. శ్రీరాములు ఎన్నికల పరిశీలకుడుగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా రామగుండం కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కందుల నరహరి, మడూరి అంబదాస్, మంజుల, కార్యదర్శులుగా ఎండి మోసిన్, శ్యామ్యూల్ ఆనంద్, బుక్క రాజు, రాజ్యలక్ష్మి, రాచర్ల మాధవి, కోశాధికారులుగా తోట రాజు, దూడల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాస్, యాదగిరి, బి లక్ష్మణ్, నాగుల రాజు పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మనుక సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వస్కుల జాయేందర్, మహ్మద్ ఖాదర్ పాషా, గూడ నాగరాణి, కార్యదర్శులుగా బైరి సరిత, మంద దయాకర్ బాబు, పూర్మ ఎల్లయ్య ఎన్నికయ్యారు.

బాధ్యతల స్వీకరణ

నర్మెట: నర్మెట నూతన తహసీల్దార్‌గా కే.వి. రామానుజాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం. మహిపాల్‌రెడ్డి బదిలీపై బచ్చన్నపేటకు వెళ్లగా ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రామానుజాచారి పదోన్నతిపై నర్మెటకు వచ్చారు.

తహసీల్దార్‌గా మహిపాల్‌రెడ్డి

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండల తహసీల్దార్‌గా ఎం. మహిపాల్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన విశాలాక్షి డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్‌పై నల్లగొండకు బదిలీ కాగా నర్మెట మండల తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు.